## 8, 9 తేదీల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీ పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురం

అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకం ద్వారా పాఠశాలలకు కేటాయించిన నిధులు, పరికరాల పరిశీలనకు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ జిల్లాలో ఈనెల 8,9 తేదీల్లో పర్యటించనున్నట్లు డిఇఒ ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. జిల్లాలో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలు 24 ఉన్నాయని, వీటితో పాటు స్టీమ్ (సైన్సు టెక్నాలజీ ఇంజీరింగ్ అండ్ మాథ్స్) ప్రయోగశాలలు -3, ప్రతి ఉన్నత పాఠశాలలో సైన్సు ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు. జిల్లా పరిధిలో ఈ రెండు రోజుల పర్యటనలో భాగంగా అట్లాస్‌తో పాటు సాధారణ ప్రయోగశాలలు కూడా సందర్శించి ప్రయోగాలు అమలు జరుగతున్న తీరును బృందం పరిశీలిస్తుందని, కావున ప్రయోగశాలలు, రికార్డు నిర్వహణ ఉండేలా ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్‌ఛార్జిలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని రకాల రికార్డులు అందుబాటులో ఉండాలని డిఇఒ ఆదేశించారు.

# విన్నపాలు వింటూ.. భరోసా కల్పిస్తూ..

వృద్ధురాలితో మాట్లాడి సమస్య తెలుసుకుంటున్న వి.శ్రీనివాసరావు

- 200 కిలోమీటర్లు సాగిన ప్రజా రక్షణ భేరి
- అడుగడుగునా సమస్యలపై అర్జీలు
- వైసిపి, టిడిపి మోసం చేస్తున్నాయంటూ ఆవేదన
- ప్రభుత్వంపై ఒత్తిడిచేసి సాధిద్దామన్న భేరి బృందం

*పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో 200 కిలోమీటర్ల మేర ప్రజారక్షణ భేరి సాగింది. యాత్రలో అడుగడుగునా ప్రజా, రైతు, కార్మిక, గిరిజన, ఉద్యోగుల సమస్యలపై విన్నపాలు అందాయి. నాడు టిడిపి, నేడు వైసిపి ప్రభుత్వాలు మోసం చేశాయంటూ భావోద్వేగంతో సిపిఎం నాయకుల ఎదుట మొరపెట్టుకున్నారు. చాలా మంది వినతిపత్రాలు అందజేయగా, ప్రసంగాలు విన్నాక, 'ఔను! మోసపోయాం' అంటూ తమ అనుభవాలు చెప్పుకొచ్చారు. సమస్యల చిట్టాలు అందుకున్న నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడిచేసి సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాడుతామని హామీ ఇచ్చారు. ఎర్రజెండా ఎప్పటికీ పేదలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, ప్రజల పక్షానే పనిచేస్తుందని అభయమిచ్చారు.*

గజపతినగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, శ్రేణులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, గంట్యాడ, గజపతినగరం, శృంగవరపుకోట

ప్రజా రక్షణ భేరి బస్సుయాత్ర మూడో రోజు బుధవారం ఉదయం 10 గంటలకు గజపతినగరంలో ప్రారంభమైంది. గజపతినగరంలో పురిటిపెంట రోడ్డు నుంచి పోలీస్ స్టేషన్ వరకు, తిరిగి గణేష్ కోవెల మీదుగా చంపావతి బ్రిడ్జి వరకు ప్రదర్శన సాగింది. అనంతరం బొండపల్లి మీదుగా గంట్యాడ మండల బుడతనాపల్లికి చేరింది. అక్కడ మధ్యాహ్న భోజన విరామం అనంతరం తామరాపల్లి మీదుగా శృంగవరపుకోట మండలం బొడ్డవర జంక్షన్ వరకు సాగింది. అనంతరం రాత్రికి అల్లూరి సీతారామ రాజు జిల్లా అనంతగిరి చేరింది. అన్నిచోట్లా మహిళలు.. సిపిఎం నాయకులకు హారతి పట్టి, తిలకం దిద్దారు. జనం డప్పుల చప్పుడుతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. పోడు పట్టాలు ఇప్పించాలని, తమ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని బొడ్డవర జంక్షన్‌లో గిరిజనులు వినతులు అందజేశారు. జిందాల్ బాక్సైట్ శుద్ధి ఫ్యాక్టరీ పేరిట భూములు లాగేసుకుని 18 ఏళ్ళు గడుస్తున్నా ఏర్పాటు చేయలేదని, ఉద్యోగాలు ఇస్తామంటూ మోసం చేశారని బాధిత గిరిజనులు వినతి అందజేశారు. గజపతినగరంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి భవనాలు ఏర్పాటు చేయాలని, గంట్యాడలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ బిసి హాస్టల్ భవనాలను పునర్నిర్మించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెనల నిధులు విడుదల చేయాలని వినతులిచ్చారు. తాము గొర్రెలు మేపుతూ జీవనోపాధి పొందుతున్న కొండను కృషి విజ్ఞాన కేంద్రం పేరిట లాగేసుకుని పొట్ట కొట్టేందుకు పాలకులు ప్రయత్నం చేస్తున్నారంటూ దత్తిరాజేరు మండలం చినరావుపల్లికి చెందినవారు వినతి అందజేశారు. అంగన్‌వాడీలు, భవన నిర్మాణ కార్మికులు, డప్పు కళాకారులు, రైతులు, ఉపాధి కూలీలు తమ సమస్యలపై వినతులందించారు. వీటిపై నాయకులు స్పందిస్తూ ప్రభుత్వంపై పోరాడి న్యాయం చేస్తామన్నారు. భేరి యాత్రలో భాగంగా శృంగవరపుకోట మండలం బొడ్డవర వద్ద 2006లో జిందాల్ బాక్సైట్ శుద్ధి కర్మాగారం కోసం కేటాయించిన భూములను, బుడతనాపల్లిలో ఎండిపోయిన వరి పొలాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ పరిశీలించారు.

బుడతనాపల్లిలో వరిచేను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పిఎన్‌ఎం కళాకారుల నృత్య ప్రదర్శన

- గజపతినగరం, బుడతనాపల్లి, తామరాపల్లి, బొడ్డవర జంక్షన్లలో జరిగిన సభల్లో నాయకులు మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షాభావం వల్ల జిల్లాలో వరిపంట ఎండిపోయిందని, ఇప్పటికే పంటనాశనమైన నేపథ్యంలో కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. లేదంటే రైతులను సమీకరించి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామని హెచ్చరించారు. పదేళ్లగా పెండింగ్‌లో ఉన్న పెదమానాపురం రైల్వే ఫ్లైఓవర్ పూర్తి చేయలేదన్నారు. తోటపల్లి గజపతినగరం బ్రాంచ్ కెనాల్ పూర్తి చేసి 15 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పిన సిఎం జగన్మోహన్ రెడ్డికి మాట నిలబెట్టుకోవడం చేతకాలేదన్నారు. వైసిపి ప్రభుత్వం భూపంపిణీ పేరిట పేదల వద్ద ఉన్న అసైన్డ్ భూములను ఆక్రమణదారులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మెంటాడ, పాచిపెంట మండలాల్లో దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చేదుకు మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు.

నాయకులకు వినతి అందిస్తున్న విద్యార్థులు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో ఇప్పటికీ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అదానీ, అంబానీల ప్రయోజనాల కోసం కేంద్రం విద్యుత్ సంస్కరణలు తీసుకొస్తే, రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి సర్కారు వాటిని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. అందువల్లే విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యులపై పెనుభారం పడుతోందని విరుచుకుపడ్డారు.

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర నాయకులు హైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన చెందారు. స్కీమ్‌వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ, పనికి తగ్గ వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ● సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్ మాట్లాడుతూ వైసిపి, టిడిపితోపాటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజనులకు తీరని ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. గిరిజన చట్టాల్లో మార్పుచేసి అభివృద్ధి పేరిట కొండలు, అడవుల నుంచి గిరిజనులను దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ● ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, టిడిపి, జనసేన నాటకీయ రాజకీయాలు ప్రజలకు వివరించి, ఆయా పార్టీల నుంచి రక్షించేందుకే సిపిఎం ఆధ్వర్యాన ప్రజారక్షణ భేరి.. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నామన్నారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే బహిరంగ సభకు తరలి రావాలని, ప్రజా సమస్యలపై అక్కడ చర్చించి, భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

కిల్లో సురేంద్ర

తమ్మినేని సూర్యనారాయణ

విధానాలన్నీ మన రాష్ట్రంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నారని, దీనివల్ల అన్ని తరగతుల ప్రజానీకంపై భారాలు పడుతున్నాయని, వ్యవస్థలు నిర్వీర్యమౌతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేస్తానని గద్దెనెక్కిన ప్రధాని మోడీ నష్టదాయకమైన వ్యవసాయ చట్టాలు తీసుకొస్తే వైసిపి, టిడిపి ఎమ్‌పిలంతా వంతపాడారని వివరించారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు, గాడి అప్పారావు, పి.రామ్మోహన్, జగన్ మోహన్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, కౌలురైతుల సంఘం జిల్లా నాయకులు రాకోటి రాములు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎండుతున్న వరి

**కంటతడి పెడుతున్న అన్నదాతలు**
**కరువు ప్రాంతంగా ప్రకటించని ప్రభుత్వం**

ప్రజాశక్తి - వీరఘట్టం

ఆరుగాలం ఎంతో కష్టించి, శ్రమించడంతో పాటు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసినప్పటికీ వర్షాభావ పరిస్థితుల కారణంగా చేతికి అంది వచ్చే పంట కళ్లముందే ఎండిపోవడంతో అన్నదాతలు కంటతడి పెడుతున్నారు. మండలంలోని నీలంపేట, వంకాయలగెడ్డ, గదబవలస, హుస్సేన్‌పురంకు చెందిన రైతులు కూరంగి సరోజిని, నారాయణపురం నీలశెట్టి, నాసు భోగమ్మ, పక్కి గౌరమ్మ, పొట్నూరు సుందరమ్మ, పుష్ప, తెగల శాంతమ్మ, తలచింతల సావిత్రమ్మ, రాయిల దాలమ్మ, తాతబాబు, గొర్ల పెద్ద సీతయ్య, తదితర రైతులకు వరి పంట పూర్తిగా ఎండిపోయింది. ప్రస్తుతం పంట పొట్ట దశకు వచ్చినప్పటికీ కొంతకాలంగా వర్షాలు కురవకపోవడంతో చేతికందే వచ్చే పంట ఎండ వేడిమి తట్టుకోలేక మాడిమసైపోయింది. అలాగే నిత్యం ఆరుతడితో ఉండాల్సిన భూమి కూడా ఎక్కడికక్కడ బీటలు వారి దర్శనమిస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు, దుక్కులు, గాపుతీయడాలు ఎకరాకు సుమారు రూ.20వేలు పైబడి పెట్టుబడులు పెట్టినట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు వరుణదేవుడు తమపై జాలి చూపకపోవడంతో పచ్చగా ఉండాల్సిన పంటలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. పంట వస్తున్న ఆశలు నిరాశ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి మదుపులు పెట్టామని, ఆ అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక అయోమయంలో రైతులు పడ్డారు. ఇంత కరువు నెలకొన్నా ప్రభుత్వం మాత్రం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హుస్సేన్‌పురంలో ఎండిపోయిన పంట పొలాలను చూపుతున్న మహిళా రైతులు

# పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా యంత్రాంగం అనుభవపూర్వక అభ్యాస కేంద్రంగా ఇన్నోవేషన్ హబ్ ప్రతిపాదనను నీతి ఆయోగ్ ప్రశంసించింది. మౌలిక సదుపాయాల రంగంలో పనులు విజయవంతంగా పూర్తి, దూర ప్రాంతాల్లో మొబైల్ టవర్లను ఏర్పాటుపై నీతి ఆయోగ్ ప్రశంసించింది. జిల్లాలో నీతి ఆయోగ్ ఎక్సర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్ట్ కింద ఇన్నోవేషన్ హబ్, అనుభవపూర్వక అభ్యాస కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బివిఆర్ సుబ్రహ్మణ్యం బుధవారం ఆశావాహ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆశావాహ జిల్లాల కింద పార్వతీపురం మన్యం జిల్లాకు నీతి ఆయోగ్ ప్రోత్సాహకంగా రూ.3 కోట్లు మంజూరు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని కోరింది. పార్వతీపురంలో అనుభవపూర్వక అభ్యాస కేంద్రమైన ఇన్నోవేషన్ హబ్ను స్థాపించడానికి పార్వతీపురం మన్యం జిల్లా యంత్రాంగం ప్రాజెక్టును సిద్ధం చేసింది. వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అనుభవ పూర్వకంగా విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించడం, పరిశీలన, డేటా రికార్డ్ చేయడం, నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను పెంపొందించడం, నాణ్యమైన విద్యను సాధించడం, విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఉన్నత చదువులు చదవాలనే సంకల్పంతో ప్రతిపాదించామన్నారు. కాన్సెప్ట్ అవగాహన ద్వారా నైపుణ్యాలు, జ్ఞానాన్ని పొందే అవకాశాన్ని ఈ ప్రాజెక్టులో పొందుపరిచామని చెప్పారు. జెఎన్‌టియు, ఆంధ్రా యూనివర్సిటీ తదితర ప్రాంతాల నుంచి మాస్టర్ ట్రైనర్లను గుర్తించామని తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. జీవ, భౌతిక, ఖగోళ, రసాయన శాస్త్ర ప్రయోగశాలలను సంబంధిత నమూనాలతో ప్రతిపాదించారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు ప్రాజెక్ట్‌లో భాగస్వాములుగా ఉంటారు. సివిల్ పనులు, అన్ని నమూనాలను కొనుగోలు 15 రోజుల్లో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం యోచిస్తోందన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, ఆర్‌డిఒ కె.హేమలత ప్రాజెక్టును సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ ప్రాజెక్టుకును సిఇఒ సుబ్రహ్మణ్యం ప్రశంసించారు. ఇది మంచి ప్రతిపాదనని, అటల్ టింకరింగ్ ల్యాబ్లోని నీతి ఆయోగ్ జాతీయ స్థాయి ఎగ్జిక్యూటివ్ బృందం మద్దతు ఇస్తుందని, అందుకు నోడల్ అధికారిని నియమించాలని కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒను నోడల్ అధికారిగా నియమించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి, ఆర్‌డిఒ, ఇంటర్ విద్యాశాఖాధికారి డి.మంజులవీణి, డిఇఒ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

## 15న చలో విజయవాడ : సిపిఎం

ప్రజాశక్తి - బెలగాం

అసమానతల్లేని రాష్ట్ర అభివృద్ధి కోసం జరిగే సిపిఎం ప్రజారక్షణభేరి ముగింపు సభ ఈనెల 15న విజయవాడలో జరుగుతుందని, దీన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అంతా ప్రచారం, సభలు, సమావేశాలు, గ్రామ, వార్డు వీధి సమావేశాలు, పాదయాత్రలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా ప్రజా సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ, అసమానతల్లేని సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ద్రోహం చేసిన బిజెపి విధానాల్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్ర జిల్లా అంతా విస్తృత ప్రచారం చేపట్టిందన్నారు. ఈ ప్రచారం అనంతరం ఈనెల 15 చలో విజయవాడ భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, బివి రాఘవులు పాల్గొంటారని, కావున అన్ని తరగతుల ప్రజలు విజయవాడ తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, కె.రామస్వామి, పట్టణ కమిటీ నాయకులు బి.సూరిబాబు, వి.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

## ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

**పార్వతీపురం :** భామిని మండలంలో పనిచేసేందుకు నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాకు ఫెలోగా నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. వీరికి రూ.55వేలు నిర్దిష్ట వేతనంతో పూర్తి తాత్కాలిక ప్రాతిపదికన నియామకం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 2నుంచి 10వరకు (కార్యాలయ పని దినాల్లో) జిల్లా అర్ధ గణాంక అధికారి, కలెక్టర్ వారి కార్యాలయం, పార్వతీపురం మన్యం, 535501కు స్వయంగా గానీ, పోస్ట్ ద్వారా గానీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు https://parvathipurammanyam.ap.gov.in లోను, ఫోన్ 9493312582ను సంప్రదించాలని తెలిపారు.

# పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితమని, దేశంలో అనేక భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు ఆద్యుడని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అవతరణను పురస్కరించుకొని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రావతరణ ఉత్సవాలకు కలెక్టరు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒకే బాష మాట్లాడే వారికి ఒకేరాష్ట్రం ఉండాలని, వివక్షకు గురవుతున్న తెలుగువారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలని అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణనిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. వారి త్యాగఫలితంగా 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైందన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు దేశం, రాష్ట్రం అభివృద్ధికి కృషిచేయాలని, ప్రజల కోసం వారి జీవితాన్ని త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి స్వాతంత్ర్యసమర యోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, కలెక్టరు కార్యాలయ ఎఒ ఆర్.ఉమామహేశ్వరరావు, డిఎంహెచ్‌ఒ బి.జగన్నాధరావు, డిపిఆర్‌ఒ ఎల్.రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, డిపిఒ బి. సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

**ఎస్‌పి కార్యాలయంలో...**

ఆంధ్రప్రదేశ్ అవతరణను పురస్కరించుకొని స్థానిక పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్, పోలీస్ సంప్రదాయ వందనాల నడుమ జాతీయ జెండాను ఎగురవేసి అనంతరం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, కుమార్, సైబర్ సెల్ ఎస్‌ఐ రవీంద్రరాజు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో...**

**పార్వతీపురం టౌన్ :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి కమిషనర్ జె.రామప్పలనాయుడు పూలమాలను వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి రూబెన్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, మహిళా ఉంద్యోగులు, సచివాలయం ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**సాలూరు:** మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు, గొర్లి వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అవతరణ కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన మహా పురుషుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మండవిల్లి బద్రి పాల్గొన్నారు.

## ఓటరు నమోదు, సవరణకు ప్రత్యేక శిబిరాలు

**పార్వతీపురం :** ఓటరు నమోదు, సవరణ కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టరు ఛాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదుకు, అభ్యంతరాల స్వీకరణకు ఈనెల 4,5, డిశంబరు 3,4 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోనివారు, జనవరి 1 నాటికి 18 ఏళ్ల పూర్తవుతున్న యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. అక్టోబరు 27న విడుదల చేసిన ఓటరు జాబితా ముసాయిదాలో అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, వాటిలో తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలుంటే తెలియజేయాలని సూచించారు. ఫారం 7,8 ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని, ముసాయిదాలోని క్లైములు, అభ్యంతరాలను అక్టోబర్ 27 నుండి డిసెంబరు 9 వరకు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరించి, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని స్పష్టం చేశారు. ఓటరు జాబితా తయారీ ప్రక్రియ పట్ల రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకట్రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలి : పిఒ

ప్రజాశక్తి - సాలూరు/పాచిపెంట

మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలని, లేఅవుట్లలో నిర్మాణాలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ తెలిపారు. మండలంలోని నెలిపర్తి వద్ద గల జగనన్న పట్టణ గృహ లేఅవుట్‌ను పిఒ బుధవారం పరిశీలించారు. లేఅవుట్‌లో అప్రోచ్ రోడ్లు నిర్మాణం, నీటి సదుపాయం కోసం బోర్‌వెల్ డ్రిల్లింగు పనులను వెంటనే మొదలు పెట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా అధికారులను ఆదేశించారు. అనంతరం పాచిపెంట మండలం పి.పి.కోనవలసలో గల ఎపిటిడబ్ల్యుఆర్‌జెసి బాలికల కాలేజీని తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటగది, భోజనాలు హాలు పరిశీలించారు. స్టాకు రూం, రిజిస్టర్లు తనిఖీ చేశారు. హాస్టల్‌లో వసతులు, సమస్యల గూర్చి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించాలని వార్డెన్‌కు, మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులను అదేశించారు. ఈ పర్యటనలో సాలూరు మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - పాచిపెంట

ఎంపిపి బి ప్రమీల అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి పిఆర్‌ఏఇ, ఆర్ అండ్‌బి, పిఆర్ డిఇ గైర్హాజరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపిపి, ఎంపిడిఒను కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడం లేదని బిల్లులు చెల్లింపులు ముందుగానే పర్సంటేజీలు అడుగుతున్నారని పలు గిరిజన పంచాయతీల సర్పంచులు పిఆర్ జెఇ వరలక్ష్మిని ప్రశ్నించారు. ప్రాధాన్యత క్రమంలో బిల్లులు చెల్లిస్తున్నామని ఆమె బదులిచ్చారు. పాచిపెంట జగనన్న కాలనీలో అవినీతి అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయని హౌసింగ్ ఎఇ వెంకటేష్‌ను ఎంపిటిసి దండి ఏడుకొండలు ప్రశ్నించారు. లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా బిల్లులు చెల్లిస్తున్నామని అక్రమాలకు మా పరిధి కాదని ఆయన బదులిచ్చారు. పాంచాలి, కోటికి పెంట సర్పంచులు యుగంధర్, అప్పలనాయుడు మాట్లాడుతూ కల్యాణ ఇళ్లకు బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదని ఎఇ వెంకటేష్‌ను ప్రశ్నించారు. నిర్మాణాలు పరిశీలించి బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రభుత్వం ద్వారా రైతులు వద్ద ఉన్న పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి కే తిరుపతిరావును సభ్యులు కోరారు. ఈ సమావేశంలో జెడ్‌పి వైస్ చైర్మన్ కె.సింహాచలం, మార్కెట్ కమిటీ చైర్మన్ దండి అనంత కుమారి, వైస్ ఎంపిపిలు ఎం నారాయణ, రవీంద్ర, ఎంపిడిఒ లక్ష్మీకాంత్, తహశీల్దార్ రాజశేఖర్, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: పిఆర్ జెఇ వరలక్ష్మిని ప్రశ్నిస్తున్న సభ్యులు

**సాలూరు రూరల్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సమావేశం బుధవారం ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులు వారి గ్రామాల్లో ఉండే సమస్యలను సమావేశంలో అధికారులకు తెలియజేశారు. కారాడవలస సర్పంచ్ జి.శంకర రావు మాట్లాడుతూ గ్రామస్తులు రేషన్ సరుకులు తీసుకునేందుకు దండిగం, జిల్లేడువలస వరకు సుమారు 5 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తున్నారని ఇప్పుడు రోడ్డు సదుపాయం అందుబాటులోకి వస్తున్న సందర్భంగా తమ గ్రామం వరకు నిత్యావసర సరుకులు వాహనం ద్వారా తీసుకొచ్చి పంపిణీ చేయాలని కోరారు. కురుకుట్టి ఎంపిటిసి సుబ్బమ్మ మాట్లాడుతూ తమ పరిధిలో చాలా అంగన్వాడీ సిబ్బంది రేషన్ కార్డులు లేక వారికి వచ్చే తక్కువ జీతాలతో చాలా ఇబ్బందులు పడుతున్నారని అటువంటి వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. తహశీల్దారు బాల మురళీ కృష్ణ మాట్లాడుతూ సభ్యులు అడిగిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఒ శివకుమార్, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంత కుమారి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: వివరాలు వెల్లడిస్తున్న అధికారి

## వంతెన నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడండి

ప్రజాశక్తి - కురుపాం

శిథిలావస్థలో ఉన్న వంతెన నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని గిరిజన సంఘం నాయకుడు ఎం.రమణ అధికారులను కోరారు. బుధవారం మండలంలోని మొండెంఖల్ సమీపంలో ప్రధాన రహదారి వద్ద శిథిలావస్థలో ఉన్న వంతెనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం నుండి నీలకంఠాపురం మీదగా శ్రీకాకుళం జిల్లాకు వందలాది వాహనాలు వెళ్తుంటాయని ఈ వంతెనకు సైడ్ రైలింగ్ వాళ్ళు కూడా సక్రమంగా లేవని వంతెన కూడా పురాతనమైందని అన్నారు. ఇరుకుగా ఉండటం వల్ల చాలాసార్లు వాహనచోదకులు ప్రమాదాలకు గురై కొందరు మృత్యువాత పడగా మరికొందరు తీవ్ర గాయాలై కాలు, చెయ్యి పోగొట్టుకునే సంఘటనలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే వంతెనను నిర్మించాలని ప్రజలు ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.

వంతెనను పరిశీలిస్తున్న రమణ

## ప్రకృతి వ్యవసాయంపై వర్క్‌షాప్

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలోని ప్రకృతి వ్యవసాయం, పర్యావరణంపై బుధవారం తోటపల్లి జట్టు కార్యాలయంలో వర్క్‌షాపు జరిగింది. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పించారు. వర్క్‌షాపులో గతంలో ప్రీస్కూల్ సిలబస్ కోసం తయారు చేసిన అంశాలపై పాట, కథ, వ్యాసం, సంభాషణలు ఎవరు రాస్తారని రచయితలకు ఒక్కొక్కరికి ఒక్కొక్క విషయంపై అవగాహన కల్పించారు. సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు, కన్సల్టెంట్ టి.శివాజీ, హెల్త్ అండ్ న్యూట్రిషన్ విభాగానికి చెందిన జి.సత్యవతి, సిహెచ్.గౌరి పాల్గొన్నారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెలగాం భీమేశ్వరరావు కాలాలు, పంచభూతాల పరిచయం, మరో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు వ్యవసాయ పనులు, పప్పు ధాన్యాలు, బెహరా ఉమామహేశ్వరరావు వ్యవసాయ పనిముట్లు, ఆకు కూరలు, పి.గౌరీశ్వర రావు ప్రధానపంటలు, తినుబండారాలు, బివి పట్నాయక్ కూరగాయలు, దుంపలు, అల్లువాడ కైలాసరావు ఆహారపు గొలుసు, వ్యవసాయ జంతువులు, కిలపర్తి దాలినాయుడు పండ్లు మొదలైన అంశాలపై రచనలు చేసేందుకు నిర్ణయించినట్టు పారినాయుడు తెలిపారు.

## జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బెలగాం

జిల్లాలో ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని గిరిజన సమాఖ్య, గిరిజనాభ్యుదయ సంఘాల నాయకులు దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్ కలెక్టర్‌కు వినతిని అందజేశారు. జిల్లా ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసు ఏర్పాటు చేయకపోవడం దారుణమనిఅన్నారు. ఎంప్లాయిమెంట్ ఎక్కడ చేయించుకోవాలో తెలియక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, కావున తక్షణమే జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసును జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందించి త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## ఆర్‌డిఒను కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

ఇటీవలే ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన లావణ్యను డిఎస్‌పి జివి కృష్ణారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పల్లు విషయాలు చర్చించారు. డివిజన్లో శాంతి భద్రతలపై మాట్లాడారు. ప్రధాన సమస్యలపై కూడా చర్చించారు.

ఆర్‌డిఒకు మొక్కను అందిస్తున్న డిఎస్‌పి

## భూ వివాదాలు పరిష్కారానికే ' భూ రక్షా '

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

భూ వివాదాల్లేని గ్రామాలుండాలన్నదే జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకం ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం డోకిశిల పంచాయతీ పరిధిలోని చలమవలస రెవెన్యూ పరిధిలో గల రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైఎస్‌ఆర్ జగనన్న శాశ్విత భూహక్కు, భూ పథకం "మీ భూమి - మా హామీ" అనే రీ సర్వే బృహత్తర కార్యక్రమం ద్వారా వందేళ్ల తర్వాత రాష్ట్రంలో చేపట్టిన గొప్ప కార్యక్రమమని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, గ్రామ సర్పంచ్ ఎస్ జగదీష్, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కురుపాం

పోస్టల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలలో చదువుతున్న ఐదో తరగతి నుండి డిగ్రీ విద్యార్థులకు డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా పై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వి.తిరుపతిరావు తెలిపారు. బుధవారం మండలంలో లంక జోడు, ఉదయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో, కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని 150 విద్యార్థుల వరకు పాల్గొన్నారనీ చెప్పారు. ఇంకా వారం రోజులు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ఈ పేపర్లన్ని విజయవాడలో వాల్యూషన్ చేస్తారని మొదట బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50వేలు, మూడో బహుమతిగా రూ. 25వేలు అందజేస్తారని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్రమశిక్షణతో చదవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఇప్పటి నుంచి కష్టపడి చదివితేనే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధనకు వీలుంటుందని ఎంపిడిఒ సాల్మన్‌రాజు అన్నారు. స్థానిక కస్తూరిబా పాఠశాలను ఎంఇఒ చంద్రశేఖర్‌తో కలిసి ఎంపిడిఒ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు విద్యార్థులకు కల్పిస్తోందని అన్నారు. తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని సూచించారు. ఈ సందర్భంగా నవంబర్ 3న జరగబోవు ఎస్ఇ ఎఎస్ పరీక్ష కోసం నిర్వహిస్తున్న ప్రాక్టీస్ టెస్ట్‌ను పరిశీలించారు. అనంతరం అంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీరంజిని, బిడ్డిక బీముడు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ సాల్మన్‌రాజు

# వైసిపి పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో ప్రజలకు కష్టాలే మిగిలాయి తప్ప అభివృద్ధి ఎక్కడా కానరాలేదని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి అన్నారు. జియ్యమ్మవలస మండలం తాళ్లడుమ్మ పంచాయతీ చంద్రశేరరాజుపురంలో టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు అమలతో ఇచ్చింది గోరంతైతే ప్రజల నుంచి దోచుకున్నది కొండంత అని విమర్శించారు. ధరలు పెరుగుదలతో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల కష్టాలు తీరాలంటే 2024లో టిడిపి అధికారంలోకి రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, నాయకులు నందివాడ కృష్ణబాబు, రెడ్డి బలరాం స్వామి నాయుడు, వెంపటాపు భారతి, లంక గోపాలం, జనసేన నాయకులు దత్తి శంకర్‌రావు, దత్తి నరేష్ నాయుడు, తాడేల శ్రీరామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదల సందర్భంగా మండలంలోని దుమ్మంగి పంచాయతీ టెంకసింగి, కొత్తగూడ గ్రామాల్లో టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి ఆధ్వర్యంలో గిరిజనులు సంబరాలు జరుపుకున్నారు. టిడిపితోనే గిరిజన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజన బతుకులు బాగుపడాలంటే 2024 ఎన్నికల్లో నిజమైన గిరిజన అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

**జజ్జువలో టిడిపి ప్రజా వేదిక**

**సీతంపేట:** మండలంలోని వజ్జాయిగూడ పంచాయతీ పరిధిలో గల జాజ్జువలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు ఆధ్వర్యాన బుధవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ రాబోయేది టిడిపి ప్రభుత్వమని, తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకి నెలకు రూ.1500 అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మక చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ ఐటీడీపి కోఆర్డినేటర్ హిమరక పవన్, ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, పలువురు నాయకులు, పాల్గొన్నారు. **సీతానగరం:** మండలంలోని చినంకలాం గ్రామ సర్పంచ్ పోలా అప్పల నరసమ్మ, మాజీ సర్పంచ్ పోలా తిరుపతిరావు దంపతులతో పాటు 150 కుటుంబాలు టిడిపిలో బుధవారం చేరాయి. టిడిపి ఇంఛార్జి బోనుల విజయ్ చంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అరాచకాలు పెరగడంతో చాలా మంది టిడిపి వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్,నాయకులు సత్యనారాయణ, కొల్లి తిరుపతిరావు, వేణుగోపాల నాయుడు,పెంకు వేణుగోపాలనాయుడు, గొట్టాపు వెంకట్ నాయుడు, ధర్నాల సీతారాం, కోరాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: ఇంటింటికి ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

## మార్గదర్శకాలు పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

టీకా కార్యక్రమంలో నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలో పుట్టూరు, పెదబొండపల్లి, చినబొండపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత మంది చిన్నారులు, గర్భిణీలకు టీకా వేస్తున్నదీ ఆర్‌సిహెచ్ రిజిస్టర్లు, టీకా అర్హుల జాబితా పరిశీలించారు. టీకా కార్డులో గడువు తేదీలను పరిశీలించారు. అత్యవసర మందుల కిట్ (ఎఇఎఫ్ఐ), సిరంజీలు, హబ్ కట్టర్, వ్యాక్సిన్‌ను టీకా కేంద్రంలో తనిఖీ చేశారు. టీకా వేయడానికి ముందురోజు తెలియజేస్తున్నారా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. యూవిన్ పోర్టల్‌లో టీకా వివరాల ఆన్లైన్ నమోదు ఏ మేరకు చేస్తున్నారో మొబైల్‌లో పరిశీలించారు. ఐదేళ్లలోపు పిల్లల టీకా వివరాల సమాచారం పూర్తి స్థాయిలో యూవిన్, ఆర్సీహెచ్ పోర్టల్స్‌లో ఆన్లైన్ నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. టీకాల ఆవశ్యకత పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. అనంతరం జగన్మోహనరావు పిల్లల, గర్భిణీల ఆరోగ్య పరిశీలన చేసి అవసరమైన సూచనలు చేశారు. నవజాత శిశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, ఎఎన్ఎంలు నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, కమలకుమారి, ఎంఎల్‌హెచ్‌పి సౌజన్య, పద్మా వతి, హెల్త్ అసిస్టెంట్ కన్నం నాయుడు, అంగన్వాడీ సిబ్బంది కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు

## కార్యకర్తకు నోటీస్ ఇవ్వడం అన్యాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నేరం ఒకరిది-నింద మరొకరిదన్న చందంగా కోడిగుడ్లను సరఫరా చేసే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా అంగన్‌వాడీ కార్యకర్తకు షోకాజు నోటీసు జారీ చేయడం అన్యాయమని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 13వ వార్డు, బైపాస్ కాలనీ-2, అంగన్ వాడీ కార్యకర్త బి.శ్రీదేవికి షోకాజు నోటీసు జారీ చేసినట్లు ప్రోజెక్టు అధికారి బి.శ్రీనివాసరావు తెలిపడం అన్యాయమన్నారు. కాంట్రాక్టర్ ద్వారా సరఫరా చేస్తున్న నాసిరకమైన గుడ్లపై అంగన్‌వాడీలకు సంబంధం ఏమిటని, ఏడో నెల నుండి, మూడో సంవత్సరం వరకు పిల్లలకు, ఆరు నెలల వరకు బాలింతలకు సేవలను అందిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలకు సేవలు చేస్తున్న అంగన్‌వాడీలకు ప్రతినెలా సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఆరు నెలలు నుండి బిళ్లు లేవని, కనీస వేతనం అమలు చేయరని, ఫిఎఫ్‌లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు లేక ప్రతిక్షణం భయం భయంతో ఉద్యోగాలు చేయాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు సేవలందిస్తున్న అంగన్వాడీలు జీతాలు, బిళ్లు రాకపోయినా అప్పులు చేసుకొని కేంద్రాలను నడుపుతున్న వీరికి గుర్తింపు లేదు సరికదా నేరాలు చేసినవారిలా చూడడం సరికాదని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తకు ఇచ్చిన షోకాజ్ నోటీసుపై పునరాలోచన చేయాలని అధికారులను ఆయన కోరారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష

**సీతానగరం:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చివరి రోజు మండలంలోని సూరంపేట గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, పరీక్షలతో పాటు అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. రోగులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా కుర్చీలు ఏర్పాటు చేసి, వికలాంగులు, వృద్దులకు వీల్ చైర్లు సమకూర్చి వారిని వైద్యులు వద్దకు తీసుకుని వెళ్లినదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎవరూ అనారోగ్య సమస్యల వల్ల అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మామిడి బాబ్జి, బలగ శ్రీరాములు నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, స్థానిక ఎంపిటిసి బొంగు వరలక్ష్మి, సర్పంచ్ సిహెచ్ అప్పలనరస, పిఎసిఎస్ చైర్మన్ మండల త్రినాథ, జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీ వి గురురాజు, కార్యదర్శి పోల ఈశ్వర నారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

వర్షాలు కురవక పంట నష్టపోతున్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని జనసేన మండల అధ్యక్షులు ఆగూరు మణి డిమాండ్ చేశారు. వర్షాలు కురవకపోవడంతో మండలంలోని కృష్ణపల్లి, చిన్నమరికి, పెద్దమరికిలో పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడారు. అనంతరం వరాహలగెడ్డ రిజ్వాయర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో వర్షం పడకపోవడం వల్ల పంట సంవృద్ధిగా పండకపోగా, వరిపంట చేతికొచ్చే సమయానికల్లా వర్షాలు లేక పంట దిగుబడి తగ్గి, రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పంట నష్టానికి గురైన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని, వరహాలు గెడ్డ డ్యాం కుడి, ఎడుమ కాలువల బాగు చేసి రైతులకు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బోనేల గోవిందమ్మ, రాజాన బాలు, ఖాతా విస్వేశ్వరావు, గుంట్రెడ్డి గౌరీశంకర్, క్రరీ మణికంత, అక్కెన భాస్కరావు, అగూరు శ్రీను తాతబాబు, మహేష్, ఆ గ్రామ రైతులు జుగున్, హరినాథ, అశోక్, గోవింద, జగన్నాధం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

## మేస్త్రీలే అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ అభివృద్ధి పనులు సంబంధిత అధికారుల పర్యవేక్షణ జరగాల్సి ఉండగా, వారి నిర్లక్ష్యం వల్ల మేస్త్రిలే అధికారుల అవతారమెత్తి కాంక్రీట్ పనులు చేస్తున్నారు. మండలంలోని హుస్సేన్‌పురం వద్ద తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ 7వ బ్రాంచ్ నుండి నీలంపేట మీదుగా జరడా గ్రామం వరకు పనులు చేపడుతున్నారు. ఈ పనులను శ్రీకాకుళానికి చెందిన శ్రీ శిరిడీ సాయి బాలాజీ కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో గత నాలుగేళ్లుగా రహదారి నిర్మాణ పనులు జరజరుగుతున్నాయి. మండలంలోని గదభవలస పంచాయతీ పరిధి సంధిమానుగూడ గ్రామ సమీపంలో రక్షణ గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అధికారులు లేకపోవడంతో పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేకపోయినా గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మిస్తున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎట్టకేలకు గ్రామాలకు రహదారి నిర్మాణ పనులు చేపట్టినా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై ఐటిడిఎ జెఇ నాగభూషణ్‌ను వివరణ కోరెందుకు 'ప్రజాశక్తి' ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

పనులు చేస్తున్న మేస్త్రీలు

## జిల్లా కేంద్రాసుపత్రి

## ఎఒగా శ్రీధర్

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాసుపత్రి పరిపాలన అధికారి ఎఒగా మీసాల శ్రీధర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదే ఆసుపత్రిలో సూపరిండెంట్‌గా పనిచేస్తు, ఆసుపత్రిలో అన్ని విభాగాలపై పూర్తి అవగాహన ఉన్న శ్రీధర్, పదోన్నతి పై ఏవోగా రావడం సంతోషించ దగ్గ విషయమని ఆసుపత్రి సూపరిండెంట్ బి వాగ్దేవి అన్నారు. ఈయన నియామకం పట్ల వైద్యులు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ రైలు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు 50 లక్షల ఎక్స్ గ్రేషియా, ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలని, గాయపడిన వారికి రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరకాలంలో నేటికి వివిధ రాష్ట్రాల్లో ఐదు రైల్వే పెద్ద ప్రమాదాలు జరిగాయని, ట్రైన్ ఎక్కాలంటే భయపడే పరిస్థితి ఉందని అన్నారు. సిగ్నల్ ప్రాబ్లమ్స్ సరైన పద్ధతుల్లో మెరుగుపరచాలని ఇప్పటికే రైల్వేలో ఖాళీగా ఉన్న మూడు లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. రైల్వేలో ఎటువంటి ప్రమాదం జరిగిన పూర్తి బాధ్యత ప్రధానమంత్రి, రైల్వే శాఖ మంత్రి వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, గిరిజన సంఘం నాయకులు లచ్చుమయ్య, రైతులు త్రినాథ్ నాయుడు, రాము, వెంకట్రావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కొల్లి సాంబమూర్తి, తదితరులు

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

## కళాశాలలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల( బాలురు)లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పాలకొండ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పర్యవేక్షణలో బాల, బాలికలకు బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో భాగంగా విద్యార్థుల ఎత్తు, బరువు, ముఖ్యంగా రక్తహీనతకు సంబంధించిన హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. సుమారు 250 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హెల్త్ అసిస్టెంట్లు రామారావు, రామశేషు, ఆశా కార్యకర్తలు మహేశ్వరి, లక్ష్మి రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలోని కాలేజీ ప్రిన్సిపల్ పైల శంకరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణరావు, వెంకటేశ్వరరావు, నారాయణరావులు పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధిపై సమావేశం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సుస్థిర అభివృద్ధి సాధన (ఎస్‌డిజి) కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు, ఎఎన్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పైడితల్లి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం విధిగా తీసుకునేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే మహిళా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ నాలి అర్జునరావు, ఇఒపిఆర్‌డి ఎల్ గోపాలరావు, అంగన్వాడీ వర్కర్లు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ పైడితల్లి

## తోటపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాల పునర్నిర్మాణ పనుల్లో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈమేరకు ఆలయాలకు భక్తులు వచ్చేందుకు వీలుగా ఖడ్గవలస జంక్షన్, తోటపల్లి, తదితర ప్రాంతాల్లో అవసరమైన బోర్డులను ఏర్పాటు చేసినట్లు తోటపల్లి టెంపుల్స్ డెవలప్మెంట్ సేవా ట్రస్ట్ సభ్యులు వడ్డి మహేశ్వరరావు (మహేష్) తెలిపారు. తోటపల్లి టెంపుల్స్ డెవలప్మెంట్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రధానగోపురం, సాక్షిగణపతి ఆలయం, అభయాంజనేయస్వామి గుడి, ఐదుఅంతస్తుల రాజగోపురం, పూజారుల వసతి గృహాల నిర్మాణంతోపాటు, ఆలయం మరమ్మతు పనులు జరుగుతున్నాయని మహేష్ తెలిపారు.

బోర్డును ఏర్పాటు చేస్తున్న ట్రస్టు సభ్యులు

## ఆశ్రమ పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం డిప్యూటీ డిఇఒ ఎ. లిల్లీరాణి 9 మంది ఉపాధ్యాయుల బృందంతో కలిసి వార్షిక తనిఖీ చేపట్టారు. పాఠశాల నిర్వహణ, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. ఈ సంవత్సరం మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. దానికి తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి ఉమావాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.